PRGI No: TGBIL/25/A0946

# విశాలజ్యోతి

సమగ్ర తెలుగు దినపత్రిక

DK MEDIA
approved by Govt of INDIA, TELANGANA
OUR SERVICES
* NEWS PAPER
* NEWS CHANNEL
* DK GRAPHICS
* DK ADS & PROMOTIONS
* DK PRINTERS
* DK PUBLICATIONS
WE'RE HIRING REPORTERS
for more details 9440711117, www.vishalajyothi.com

వరంగల్ సంపుటి : 02 సంచిక : 24 శనివారం, ఆగస్టు 22 2026, పేజీలు - 4 వెల : 5 రూ/-

### అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు

## భారత్‌ను ప్రపంచ కేంద్రంగా మార్చాలి

- దేశ అంతరిక్ష రంగం గురించి కీలక వ్యాఖ్యలు చేసిన నరేంద్ర మోదీ
- వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్టార్టప్‌లను కోరిన ప్రధాని



**న్యూ ఢిల్లీ** అంతరిక్ష రంగంలో ప్రపంచ ప్రతిభకు, కంపె నీలకు, పెట్టుబడులకు భారత్ ఒక ఆకర్షణ కేంద్రంగా మారగలదని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలలో అంతరిక్ష సాంకేతికతల విస్తృత అనువర్తనాలను అన్వేషించాలని స్పేస్ స్టార్టప్‌లను కోరారు. అంతరిక్ష రంగంలో ప్రతిభకు, పెట్టుబడులకు దేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చాలని అన్నా రు. శుక్రవారం నాడు సేవా తీర్థ్ (పీఎం కార్యాలయం)లో 20 స్పేస్ స్టార్టప్‌ల సీఈఓలు, వ్యవస్థాపకులతో నరేంద్ర మోదీ సమా వేశమయ్యారు. ఈ మేరకు భారత అంతరిక్ష రంగం గురించి మోదీ వ్యాఖ్యానించారు.

### చివరి నిమిషంలో రేవంత్

# అమెరికా టూర్ రద్దు.

- అమెరికా సమావేశాలకు కేంద్రం అనుమతి నిరాకరణ
- ఈ నెల 23న లండన్ నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం
- వచ్చే నెలలో అమెరికా వెళ్లే యోచన
- అమెరికా భేటీలకు అధికారులను పంపే అవకాశం
- 'తెలంగాణ రైజింగ్' ఆగదని సీఎం స్పష్టీకరణ



**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన చివరి నిమిషంలో రద్దయింది. అమెరికాలో నిర్వహిం చాల్సిన 'తెలంగాణ రైజింగ్' సమావేశాలకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో బ్రిటన్ పర్యటన ముగించుకొని సీఎం ఈ నెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి లండన్, అమెరికాలో 'తెలంగాణ రైజింగ్' పేరుతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా అమెరికాలోని బోస్టన్, న్యూయార్క్‌లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి కార్యాలయం షెడ్యూల్ కూడా సిద్ధం చేసింది. అయితే చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ నుంచి అనూహ్య పరిణా మం ఎదురైంది. యూకేలో జరిగే సమావేశాలకు మాత్రమే అనుమతి లభించింది. అమెరికాలో నిర్వహించాల్సిన సమా వేశాలకు గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో సీఎం తన పర్యటనను కుదించుకుని హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించు కున్నట్లు తెలుస్తోంది. అయితే, కేంద్రం నిర్ణయం వెనక కారణం ఏంటనేది మాత్రం ఇంకా అధికారికంగా తెలయరాలేదు. ప్రస్తుతం రద్దయిన అమెరికా పర్యటనను వచ్చే నెలలో చేపట్టాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈసారి అమెరికాలో జరగాల్సిన భేటీలకు సీఎం స్వయంగా వెళ్లకుండా అధికారుల బృందాన్ని పంపే యోచన కూడా ఉన్నట్లు తెలుస్తోంది. తన అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరణపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ యువత భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' ప్రయాణం ఆగదని ధీమా వ్యక్తం చేశారు..

### తెలుగు రాష్ట్రాల్లో 10 చోట్ల


## ఈడీ తనిఖీలు



**హైదరాబాద్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసు కుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) షాక్ ఇచ్చిం ది. వివేకా హత్య కేసు విచా రణలో భాగంగా అధికారులు ఆయన నివా సాలు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ కేసులో మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోప ణల నేపథ్యంలో ఈడీ రంగంలోకి దిగింది. ఈ రోజు తెల్లవారుజాము నుంచే హైదరాబాద్, పులివెందులలోని అవి నాశ్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో అధికా రులు తనిఖీలు చేప ట్టారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని దాదాపు 10 ప్రాంతాల్లో వేర్వేరు బృందాలు ఏకకాలంలో ఈ సోదాలు నిర్వహిస్తు న్నాయి. , కీలక పత్రాలు, ఆస్తుల వివ రాల అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

### పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద రాహుల్ గాంధీ


## మెరుపు ధర్నా



**ఢిల్లీ:** ఢిల్లీలోని పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ప్రయోగించిన ఘటనపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత విద్యార్థి సాహిల్ లోచబ్‌తో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఆయన, విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసే వరకు అక్కడి నుంచి కదిలేది లేదంటూ పోలీస్ స్టేషన్ వద్దే బైఠాయించారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరి ంచారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. గత నెల జులై 20న జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టిన సమయంలో పోలీసులు పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని రాహుల్ గాంధీ ఆరోపిం చారు. ఈ ఘటనలో సాహిల్?కు పెల్లెట్లు తగలడంతో తీవ్ర గాయాలయ్యాయని, ఒక కంటి చూపు ప్రమాదంలో పడిందని రాహుల్ పేర్కొన్నారు. గాయపడిన సాహిల్‌కు ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స జరిగినట్లు తెలిపారు. దాంతో సాహిల్ లోచబ్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదును తీసుకుని రాహుల్ గాంధీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. ఫిర్యా దుపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఢిల్లీ స్థానిక డీసీపీతో కూడా ఆయన చర్చలు జరిపారు. అయినప్పటికీ కేసు నమోదు కాకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్దే నిరసనకు దిగారు.

### రాయదుర్గంలో ఎకరా రూ.264 కోట్లు

## - గత రికార్డులు బ్రేక్



**హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని రాయ దుర్గంలో ఎకరం భూమి రికార్డు ధర పలికింది. పాన్‌మక్తా ప్రాంతంలోని సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ శుక్రవారం వేలం నిర్వహించింది. ఈ వేలంలో ఎకరా రికార్డు స్థాయిలో రూ.264 కోట్లకు అమ్ముడుపోయింది. ఎంఎస్ఎన్ రియాలిటీ సంస్థ అధిక ధర చెల్లించి ఈ భూమిని సొంతం చేసుకుంది. మొత్తం 5.25 ఎకరాలనూ ఆ సంస్థే దక్కించుకుంది. ఇదే సర్వే నంబర్‌లో ఈ సంవత్సరం మే నెలలో నిర్వహించిన వేలంలో ఎకరా రూ.237 కోట్లు పలికింది. 3 నెలల క్రితంతో పోలిస్తే రూ.27 కోట్ల అధికంగా లభిం చినట్లయింది. టీజీఐఐసీ భూముల వేలంలో రికార్డు ధర : రాయదుర్గంలోని పాన్‌మక్తాలో 5.25 ఎకరాల భూమికి టీజీఐఐసీ వేలం నిర్వ హించింది. రూ.10కోట్ల రూపాయలు చెల్లించి పలు స్థిరాస్తి సంస్థలు ఆన్ లైన్ బిడ్డింగ్?లో పాల్గొన్నాయి. ప్రారంభ ధర 175 కోట్ల రూపాయల నుంచి బిడ్డింగ్ ప్రారం భమైంది. కనీసం కోటి రూపాయలు అధికంగా బిడ్డింగ్ వే యాల్సి ఉండటంతో పలు సంస్థలు పోటీపడి మరి బిడ్డింగ్ దాఖలు చేశాయి. చివరి కి ఎంఎస్ఎన్ రియాల్టీ కంపెనీ రూ.264 కోట్లు అధికంగా బిడ్డింగ్ దాఖలు చేయడంతో ఆ కంపెనీని టీజీఐఐసీ అధికారులు ఎంపిక చేశా రు. దీంతో టీజీఐఐసీకి రూ.1381 కోట్లు ఆదా యం సమకూరినట్లయింది. ఐటీ కారిడార్ కావ డంతో ఆ ప్రాంతంలో భూమికి ఎంతో విలువ ఉంది. ఇప్పటికే పలు బహుళ అంతస్థుల భవనాల్లో అంతర్జాతీయ కంపెనీల కార్యాల యాలు కొనసాగుతున్నాయి. జీసీసీ, ఐటీ కంపెనీలు, ఇతర కార్పొరేట్ కార్యాలయాలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయి.

### కొండా సురేఖను మంత్రి పదవి నుంచి

## బర్తరఫ్ చేయాలి

**హైదరాబాద్,:** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది. ఈ అంశంపై ఉమ్మడి వరంగల్, నల్లగొ ండ జిల్లాలకు చెందిన 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు సీఎల్పీ వేదికగా సమావేశమై చర్చించారు. అనంతరం కొండా సురేఖను రాష్ట్ర మంత్రివర్గం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం.సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను టార్గెట్ చేస్తూ కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగినట్లు తెలుస్తోంది. ఆమె వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న నేపథ్యంలో ఎమ్మెల్యేలు కూడా సురేఖకు వ్యతిరేకంగా గళం విప్పారు.సమావేశం అనంతరం ఎమ్మెల్యేలు మీడియా సమావేశంలో మాట్లాడారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలను కొండా సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని ఎమ్మెల్యేలు తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలపై బాధ్యత వహించాల్సిందేనని అభిప్రాయపడ్డారు. సీఎంను వ్యతిరేకించే వారికి పార్టీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు. మీ భాష ఎప్పుడూ పార్టీకి నష్టం కలిగించేలా ఉందని కొండా ఫ్యామిలీని ఉద్దేశించి అన్నారు.సుస్మిత వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదని సురేఖ చెప్పడంపైనా ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం





చేశారు. ఇచ్చిన వివరణ తమకు ఆమోదయోగ్యంగా లేదని తేల్చారు. సీఎం రేవంత్ ఎంతో కష్టపడి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారని అన్నారు. అలాంటి వ్యక్తిని విమర్శించినప్పుడు ఖండించడం కనీస బాధ్యత అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని బలహీనపర్చాలనే ప్రతిపక్షాల కుట్రలకు బలం చేకూర్చుతున్నారని మండిపడ్డారు. అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు.

### బెంగళూరులో భారీ నగదు పట్టివేత..

## కారులో రూ.9 కోట్లు సీజ్



**బెంగళూరు:** కర్ణాటక రాజధాని బెంగళూరులో భారీగా నగదు పట్టుబడింది. కారులో తరలిస్తున్న సుమారు రూ.9 కోట్ల నగదును ఆదాయపు పన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారంతో దాడి చేసి ఈ నగదును పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బెంగళూరు నుంచి నగదును తరలిస్తున్నట్లు గుర్తించిన అధికారులు, సమాచారం ఆధారంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కారులో భారీ మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. నగదును తూత్తుకుడికి తరలిస్తున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో సచిన్ అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### షావుకారు జానకి మరణం..

## సినీ ప్రముఖుల నివాళులు





**హైదరాబాద్,:** ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి వృ ద్ధాప్య సంబంధిత అనారోగ్య సమస్యల కారణ ంగా శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా షావుకారు జానకికి నివాళులు అర్పిస్తున్నారు. ఆమె కుటుంబసభ్యు లకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసు న్నారు. షావు కారు జానకి మరణంపై మెగాస్టా ర్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. 'ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమి ళంతో పాటు పలు భాషల్లో దాదా పు ఏడు దశాబ్దాలపాటు కొనసా గింది. వైవిధ్యమైన పాత్రలకు తన సహజమైన నటనతో ప్రాణం పోసి, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకు న్న గొప్ప నటి ఆమె. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని అన్నారు. జూనియర్ ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'తెలుగు, భారతీయ సినీ రంగంలో తనదైన ముద్ర వేసిన షావుకారు జానకి మరణవార్త ఎంతో బాధ కలిగించింది. జానకి సినీ ప్రయాణం, ఆమె పోషించిన పాత్రలు నిలిచిపోతాయి. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి' అని పేర్కొన్నారు.

# 22(ఎ) భూముల వివాదాన్ని వెంటనే పరిష్కరించాలి

- బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్.



**వరంగల్ జిల్లా, విశాలజ్యోతి:** వరంగల్ జిల్లా వ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పులపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి 22(ఎ) భూముల సమస్యపై సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో తప్పిదాలు జరిగినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంగీకరించిన నేపథ్యంలో, వరంగల్ జిల్లాలోనూ ఈ జాబితా రూపకల్పనలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గ్రామం, మండలం, సర్వే నంబర్ వారీగా 22(ఎ) భూముల పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు 22(ఎ) జాబితాలో జరిగిన చేర్పులు, తొలగింపులపై పూర్తి ఆడిట్ నిర్వహించాలని, ధరణి/భూ భారతి సహా డిజిటల్ భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని అన్నారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములను గుర్తించి వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. 22(ఎ) జాబితాలో భూముల భారీ పెరుగుదల వెనుక కుట్ర, అధికార దుర్వినియోగం లేదా అక్రమ ఆర్థిక లబ్ధి ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని, తప్పిదాలకు బాధ్యులైన అధికారులు, సిబ్బంది లేదా ఇతరులపై శాఖాపరమైన, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై స్వతంత్ర న్యాయ విచారణ లేదా సీబీఐ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలన్న డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే 22(ఎ) జాబితాలో జరిగిన భారీ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, రెవెన్యూ మంత్రి కుటుంబ కంపెనీకి ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి జరిగినట్లు వస్తున్న భారీ స్థాయి ఆస్తుల బదిలీ ఆరోపణలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్.

జిల్లా కార్యదర్శి పోనుగోటి వెంకట్ రావు, జిల్లా నాయకులు గుర్రాల చంద్రమౌళి, వంచనగిరి రాజ్ కుమార్, శివ గార్లు పాల్గొన్నారు.

# ఆవులమందను ఢీకొట్టిన లారీ



**కొమరంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా, విశాలజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని సోనాపూర్ గ్రామ సమీపంలో బొగ్గు లారీ నంబర్ ఋ.19 ు 0986 పశువుల మందపై ఢీ కొట్టింది ఒక ఆవు మృతి చెందగా, ఒక ఆవుకు వెనక రెండు కాళ్లు విరిగి లేవలేని స్థితిలో ఉంది. రెండు ఆవులకు తీవ్రంగా గాయ పడ్డాయి గ్రామ సమీపంలో తరచు ఇలాంటి సంఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు . బొగ్గు తరలించే లారీలు అతివేగంగా నడపడం వల్లనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. పశువుల మందపై లారీ దూసుకువెళ్లడంతో గ్రామస్తులు అందరు కలిసి ఇరువైపుల లారీలను నిలిపివేశారు దాదాపు రెండు గంటల పాటు ఇరువైపుల లారీలు స్తంభించడంతో అధికారులు ట్రాన్స్పోర్ట్ లారీ యజమానులు వచ్చేవరకు గ్రామస్తులు లారీలను నిలిపివేశారు. లారీ యజమాని వచ్చి సంబంధిత పశువుల యజమానులను నచ్చజెప్పడంతో రాకపోకలు పునరుద్ధరించారు.

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామ సమీపంలో వేగ నిరోధకాలు ఏర్పాటు ఏర్పాటుచేసి ప్రమా దాలు జరగకుండా చూడాలని అధికారులను గ్రామస్తులు కోరారు.

# హత్య కేసులో నిందితుల అరెస్ట్

- పోలీస్ సిబ్బందిని అభినందించిన డిఎస్పి కృష్ణ కిషోర్



**తొర్రూరు, విశాలజ్యోతి:** తొర్రూరు మండలం మడిపల్లి గ్రామంలో ఈనెల 19న జరిగిన గుంటుక రమేష్ హత్య కేసులో తొర్రూరు పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. తొర్రూర్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన మీడియా సమావేశంలో డిఎస్పి కృష్ణ కిషోర్ కేసు వివరాలను వెల్లడించారు. ఇటీవల గ్రామానికి చెందిన ఏదుల వెంకన్న ఐదవరోజు కార్యక్రమంలో జరిగిన గొడవలో అదే కులానికి చెందిన 15 మంది అతని కట్టెలు బండరాలతో కొట్టి చంపారని అతని భార్య గుంటక రజిత ఫిర్యాదు మేరకు మర్డర్ కేసు నమోదు చేసి తొరూరు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ గణేష్ కేసు దర్యాప్తు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈరోజు ఉదయం ముదిరాజ్ కుల పెద్దమనిషి కేసులో నిందితుడుగా ఉన్న ఏ వన్ ఇంటి దగ్గర నేరస్తులందరూ చేరి పారిపోవడానికి ప్రణాళిక వేసుకున్నారని సమాచారంతో పోలీసుల అక్కడికి వెళ్లి 15 మంది నిందితులు మారెస్టు చేయడం జరిగింది. మృతుడు రమేష్ వరంగల్ లో డీసీఎం డ్రైవర్ గా పనిచేస్తూ రెండు వారాలకు ఒకసారి మడిపల్లి గ్రామానికి వస్తూ ఉండేవాడని, వచ్చినప్పుడల్లా బాగా తాగి పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని ఊరిలో పెద్దమనుషులను ఊరికే తిట్టడం, బెదిరింపులకు పాల్పడుతుండేవాడని అతని బెదిరింపులకు భయపడి అతని ఏదో ఒకటి చేయాలని లేకపోతే మమ్మల్ని ఏదో ఒకటి చేసేలా ఉన్నాడని భావించిన ముదిరాజ్ కులానికి చెందిన 15 మంది వ్యక్తులు అతని కొట్టి చంపినట్లుగా నిందితులు ఒప్పుకున్నారని డిఎస్పి మీడియాకు తెలిపారు. గ్రామంలో ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయినా అన్ని వీడియోస్ ను పరిశీలిస్తున్నామని, ఇట్టి సంఘటనలో ఉన్న వారందరిని అరెస్టు అరెస్ట్ చేయడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు.

హత్య కేసును పరితగతిన ఇన్వెస్టిగేషన్ చేసిన ఇన్వె స్టిగేషన్ ఆఫీసర్ సిఐ గణేష్ ఎస్సై మహేందర్ రెడ్డి మరియు తొర్రూరు పోలీస్ సిబ్బందిని అభి నందించి, వారి పేర్లను ఉన్నతాధికారులకు రివార్డుకోసం పంపనున్నట్లు తెలిపారు.

# మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ



**హనుమకొండ జిల్లా, విశాలజ్యోతి:** హనుమకొండ జిల్లా మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం సందర్శించారు. ఉదయం శిక్షణ కేంద్రానికి చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు శిక్షణ కేంద్రం అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. వివిధ అంశాలపై శిక్షణ పొందేందుకు వచ్చే పోలీస్ అధికారులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించి, కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పనితీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్పెక్టర్ రవికుమార్, ఆర్ఐ సింహాచలం శ్రీనివాస్, ఆర్ఎస్ఐ రవితేజతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు పక్కనే వాడిన సిరంజీలు
# ప్రజల ప్రాణాలతో చెలగాటం





- నందిపేట్‌లో వైద్య వ్యర్థాల నిర్వహణపై నిర్లక్ష్యమా
- నంది విగ్రహం వద్ద ఘటన. తాజాగా వాల్గొట్ బంగ్లా సమీపంలో ప్రత్యక్షం
- పుట్టగొడుగుల్లా ప్రైవేట్ వైద్య కేంద్రాలు. అర్హతలపై అనుమానాలు
- అధికారుల తనిఖీలు ఎక్కడ? నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఎప్పుడూ?

**నందిపేట్, విశాలజ్యోతి:** నందిపేట్ మండల కేంద్రంలో వైద్య వ్యర్థాల నిర్వహణపై నిర్లక్ష్యం ప్రజల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. రోడ్డు పక్కన, బహిరంగ ప్రదేశాల్లో వాడిన సిరంజీలు కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల నంది విగ్రహం సమీపంలో వాడిన సిరంజీలు దర్శనమివ్వగా.. తాజాగా వాల్గొట్ బంగ్లా సమీపంలోనూ రోడ్డు పక్కనే సిరంజీలు కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

**వైద్య వ్యర్థాలు రోడ్డుపైకి ఎలా**

వైద్య కేంద్రాల్లో వినియోగించిన సిరంజీలు, ఇతర బయోమెడికల్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా నిబంధనల ప్రకారం సేకరించి, సురక్షితంగా పారవేయాల్సి ఉంటుంది. కానీ నందిపేట్‌లో రోడ్ల పక్కన ఇలాంటి వ్యర్థాలు కనిపిస్తుండటంతో వీటిని ఎవరు పడేస్తున్నారు ఏ వైద్య కేంద్రం నుంచి వస్తున్నాయి సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలు, చిన్నారులు, వృద్ధులు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో సిరంజీలు కనిపించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. వాటిని ఎవరైనా పొరపాటున తాకడం లేదా గుచ్చుకోవడం జరిగితే ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండటంతో అధికారులు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**పుట్టగొడుగుల్లా ప్రైవేట్ వైద్య కేంద్రాలు**

ఇదే సమయంలో నందిపేట్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్య కేంద్రాలు పెరుగుతున్న తీరుపై కూడా ప్రజల్లో చర్చ జరుగుతోంది. ప్రతి వైద్య కేంద్రానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా అక్కడ పనిచేస్తున్న వైద్యులకు తగిన అర్హతలు ఉన్నాయా? వైద్య వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నారా? అనే అంశాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

**అర్హతలేని వారు వైద్యం చేస్తున్నారా**

కొన్ని ప్రాంతాల్లో తగిన వైద్య అర్హతలు, అనుభవం లేకపోయినా వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా 'ఆర్ఎంపీ' పేరుతో ఎవరు పడితే వారు వైద్యం చేస్తున్నారా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే, ఎవరి అర్హతలపై అయినా నిర్ధారణ లేకుండా ఆరోపణలు చేయకుండా, సంబంధిత వైద్య శాఖ అధికారులు అన్ని ప్రైవేట్ వైద్య కేంద్రాల రిజిస్ట్రేషన్లు, అనుమతులు, సిబ్బంది అర్హతలు, వైద్య వ్యర్థాల నిర్వహణ విధానం వంటి అంశాలను అధికారికంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల తనిఖీలు కాగితాలకే పరిమితమా**

నందిపేట్‌లో రోడ్డు పక్కన వాడిన సిరంజీలు వరుసగా కనిపిస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారనే దానిపై స్పష్టత లేకపోవడం ప్రశ్నలను లేవనెత్తుతోంది. వైద్య వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లోకి ఎలా వస్తున్నాయి వాటిని పడేస్తున్న వారిని గుర్తించేందుకు నిఘా ఎందుకు లేదు ప్రైవేట్ వైద్య కేంద్రాల్లో చివరిసారిగా ఎప్పుడు తనిఖీలు చేశారు? అనుమతులు లేకుండా వైద్య సేవలు అందిస్తున్న కేంద్రాలపై చర్యలు తీసుకున్నారా వైద్య వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటిస్తున్నారా లేదా పరిశీలించారా అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

**ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే వరకు వేచిచూడొద్దు**

రోడ్డుపక్కన సిరంజీలు కనిపించిన తర్వాత వాటిని తొలగించడం మాత్రమే సమస్యకు పరిష్కారం కాదని స్థానికులు అంటున్నారు. వాటిని అక్కడికి తీసుకొచ్చిన మూలాన్ని గుర్తించడం, బాధ్యులను గుర్తించడం, వైద్య కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించడం, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం అవసరమని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నందిపేట్ మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్య కేంద్రాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొంటారా లేక మరోచోట కూడా వాడిన సిరంజీలు కనిపించే వరకు వేచి చూస్తారా అన్నదే ప్రస్తుతం నందిపేట్ ప్రజల ప్రశ్న.

# పిల్లల కదలికలపై ఫోకస్ పెట్టాలి

- తల్లిదండ్రులకు అబ్దుల్ బాసిత్ సూచన
- చదువు కంటే ముందు గౌరవ మర్యాదలు నేర్పాలి
- గురువులపై తిరగబడి హత్య చేసే విధంగా దిగజారడం బాధాకరం
- ఈ సంస్కృతిని ప్రభుత్వం కట్టడి చేయాలి



**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** తమ పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ఫోకస్ పెట్టి వారికి గౌరవ మర్యాదలు నేర్పించాల్సిన అవసరం ఉందని మోడ్రన్ ఇఖ్రా స్కూల్ కరస్పాండెంట్ షేఖ్ అబ్దుల్ బాసిత్ అన్నారు.

పవిత్ర శుక్రవారం సందర్భంగా చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామ పంచాయతీ లోని "మస్జిద్ ఎ ఖుభా " ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చదువు అంటే మార్కులు ర్యాంకులు కాదని చదువు సంస్కారం నేర్పాలన్నారు. పెద్దల పట్ల ముఖ్యంగా విద్యా బుద్ధులు నేర్పి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే గురువుల పట్ల గౌరవం, వినయం నేర్పాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అతిగారాభం చేయవద్దన్నారు. విద్యాబుద్ధులు నేర్పే ప్రిన్సిపాల్ నే హత్య చేసే స్థితికి విద్యార్థులు దిగజారడం దారుణం అన్నారు. ఇకనైనా తల్లితండ్రులు తమ సంతానం దినచర్యల పట్ల శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాలు సైతం పాఠశాలల్లో చిన్న నాటి నుండే పిల్లలకు నైతిక విలువలను తప్పని సరిగా బోధించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మానవతా విలువలు లేని సమాజం పట్ల బాధ్యత లేని నేటి చదువులు విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజంలో అనైతికత, హత్యాచారాలు, అశాంతికి కారణమవుతున్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ వారు మనకు ఇచ్చిన బానిస అనైతిక విద్యా మార్పుకోసం మేధావులు తల్లిదండ్రులు పోరాటం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మసీదు అధ్యక్షుడు అజీజ్ ఖాన్, సోను భాయ్, షబ్బీర్, అన్వర్, ఖరీం, అజ్జూర్, షమీం తదితరులు పాల్గొన్నారు

# నీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం

- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** నీటి ప్రాజెక్టుల పనులు విగవంతంగా జరుగుతున్నాయని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ పరిహారం చెల్లింపు పునరావాసం తదితర అంశాలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. భద్రాద్రి ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ పరిహారం చెల్లింపు పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు సం బంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ భూసేకరణ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణలో సమన్వయం చేసుకోవాలి





- వారం రోజుల్లోగా భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి


భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం, కారుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ భూముల వివరాలు సర్వే పురోగతి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హేమచంద్రపురం, కారుకొండ గ్రామాల పరిధిలో సుమారు 191.25 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా సుమారు 7.50 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్‌కు ఇప్పటివరకు సుమారు 6 ఎకరాల మేర భూ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూములకు సంబంధించిన సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సర్వే పనులను ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకొని పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. వారం రోజుల్లోగా మొత్తం భూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే పనుల పురోగతిని ప్రతిరోజూ సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు విస్తీర్ణం ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. భూ సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూ సర్వే ప్రక్రియకు సహకరించాలని అధికారులు నిర్వహించే సర్వే సమయంలో అవసరమైన సమాచారం అందించాలని రైతులను కోరారు. ప్రాజెక్టు పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని సూచించారు.

సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు సంబంధించిన పనుల్లో భూసేకరణ భూ సర్వే కీలకమైన అంశాలని కలెక్టర్ తెలిపారు.

సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, సర్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఐరన్ లోపంతో థైరాయిడ్‌పై ప్రభావమా
## ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు



శరీరంలో థైరాయిడ్ ఆరోగ్యం, ఐరన్ స్థాయిలు అనేక రోజువారీ శారీరక విధులతో సన్నిహితంగా సంబంధం కలిగి ఉంటాయి. వీటిలో ఏదైనా అసమతుల్యంగా ఉన్నప్పుడు అలసట, జుట్టు రాలడం, చలి ఎక్కువగా అనిపించడం, నిద్ర సరిగా లేకపోవడం, మెదడు మందగించినట్లుగా అనిపించడం లేదా బరువులో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాల్లో కొన్ని ఒకదానితో ఒకటి పోలి ఉండటం వల్ల ఒక్క పరీక్ష ఫలితాన్ని మాత్రమే చూసి అసలు సమస్యను గుర్తించకుండా ఉండే అవకాశం ఉంటుంది. పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం.. థైరాయిడ్ పరీక్షల్లో వచ్చే సంఖ్యలను మాత్రమే పరిశీలించడం కంటే, పూర్తి ఐరన్ ప్యానెల్‌తోపాటు థైరాయిడ్ సూచికలను పరిశీలించడానికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. థైరాయిడ్ హార్మోన్ల తయారీలో కీలకమైన ఓ ఎంజైమ్‌కు ఐరన్ అవసరమని వివరించారు. అందువల్ల శరీరంలో ఐరన్ నిల్వలు తగ్గినప్పుడు థైరాయిడ్ పనితీరుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా శరీరంలో నిల్వగా ఉన్న ఐరన్‌కు సూచికగా ఉండే ఫెరిటిన్ స్థాయిని ప్రస్తావించారు.

**ఎలాంటి ప్రభావం ఉంటుంది..**

ఫెరిటిన్ తగ్గినప్పుడు టీఎస్‌హెచ్ పెరుగుతుంది. థైరాయిడ్ పనితీరుకు జీర్ణాశయంలోని ఆమ్లం, ఐరన్ శోషణతోనూ సంబంధం ఉంటుంది. అలాగే ఐరన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల అధికంగా రుతుస్రావం జరిగే అవకాశం ఉంటుంది. దాంతో శరీరం నుంచి మరింత ఐరన్ కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. ఫెరిటిన్ స్థాయిలు తగ్గడం, థైరాయిడ్ పనితీరు మందగించడం, టీఎస్‌హెచ్ పెరగడం, కడుపులో ఆమ్లం తగ్గడం, అధికంగా రుతుస్రావం కావడం, తద్వారా ఫెరిటిన్ మరింత తగ్గడం వంటి పరిణామాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయి. ఒక్క రక్త పరీక్షలోని ఒక సంఖ్యను మాత్రమే పరిశీలించడం ద్వారా పూర్తి ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకోవడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. ఫెరిటిన్‌కు 70 నుంచి 100 నానోగ్రాములు ప్రతి మిల్లీలీటర్‌కు, సీరమ్ ఐరన్‌కు 85 నుంచి 130 మైక్రోగ్రాములు ప్రతి డెసీలీటర్‌కు, టీఎస్‌హెచ్‌కు 0.8 నుంచి 2.3 మిల్లీ ఇంటర్నేషనల్ యూనిట్లు ప్రతి లీటర్‌కు, యాంటీ-టీపీఓకు 0 నుంచి 6.8 ఇంటర్నేషనల్ యూనిట్లు ప్రతి మిల్లీలీటర్‌కు, యాంటీ-టీజీకి 0 నుంచి 1 ఇంటర్నేషనల్ యూనిట్ ప్రతి మిల్లీలీటర్‌కు మార్గదర్శక స్థాయిలుగా సూచిస్తారు.

**స్థాయిలు మారుతాయి..**

అయితే ఇవి మార్గదర్శకంగా ఉపయోగించే స్థాయిలే తప్ప, అందరికీ వర్తించే సార్వత్రిక వైద్య లక్ష్య స్థాయిలు కావు. వివిధ ప్రయోగశాలల్లో సూచించే సాధారణ స్థాయిలు మారుతాయి. అలాగే థైరాయిడ్, ఐరన్ పరీక్షల ఫలితాలను లక్షణాలు, వైద్య చరిత్ర, ఇతర పరీక్షల ఫలితాలతో కలిపి వైద్య నిపుణులు అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి ఏదైనా పరీక్షలో స్థాయి తక్కువగా లేదా ఎక్కువగా ఉందని మాత్రమే ఆధారంగా చేసుకుని స్వయంగా చికిత్స ప్రారంభించడం కాకుండా వైద్య నిపుణుల సలహా తీసుకోవడం ముఖ్యం.

# వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచన





**భద్రాద్రి కొత్తగూడెం(విశాల జ్యోతి):** కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటుగా డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్ పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యతతో చేపట్టడంతో పాటు ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

ప్రస్తుతం వైద్య కళాశాల ప్రధాన భవనాలు హాస్టల్ భవనాలు ఆసుపత్రి తరగతి గదులు ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయని మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు లైబ్రరీ తరగతి గదులు ల్యాబొరేటరీలు విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన వసతి తరగతి గదులు ల్యాబొరేటరీలు తాగునీరు ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయా ఇంకా ఏవైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని అన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు బోధనా సిబ్బంది వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య ఇంజినీరింగ్ నిర్మాణ శాఖల అధికారులు నర్సింగ్ కళాశాల అధికారులు నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రిభారత మార్కెట్‌లో విచ్చలవిడిగా నకిలీ జీఎల్‌పీ
## మందులు హెచ్చరిస్తున్న నిపుణులు




ఊబకాయం ఒక దీర్ఘకాలిక వ్యాధి. ఈ విషయాన్ని వైద్య రంగం గుర్తించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా చికిత్సా విధానాలు, ప్రభుత్వ విధానాలు, పెట్టుబడుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయి. ఈ మార్పుకు ప్రధాన కారణంగా జీఎల్‌పీ-1 మందులు నిలుస్తున్నాయి. బరువు నియంత్రణ, మధుమేహ నియంత్రణతో పాటు గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడంలో ఇవి వైద్యపరంగా గణనీయమైన ఫలితాలను అందిస్తున్నాయి. జీఎల్‌పీ-1 మందులకు డిమాండ్ వేగంగా పెరుగుతున్న సమయంలో, వాటికి సంబంధించిన పేటెంట్ల గడువు కూడా ముగుస్తోంది. దీంతో ఈ రంగంలో తదుపరి దశ రోగుల నమ్మకాన్ని ఎలా కాపాడుకోవాలనే అంశంపై ఆధారపడనుంది.

**100 కోట్ల మందికి పైగా ఊబకాయం..**

ప్రపంచవ్యాప్తంగా 100 కోట్ల మందికి పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి తీవ్రత కారణంగా ఆరోగ్య వ్యవస్థలు ఊబకాయాన్ని ఒక కీలక వైద్య సమస్యగా పరిగణించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో జీఎల్‌పీ-1 చికిత్సలు కీలకంగా మారాయి. ఇవి కేవలం బరువు తగ్గడం, టైప్-2 మధుమేహం నియంత్రణకే పరిమితం కాకుండా గుండె సంబంధిత ప్రమాదాలను తగ్గించడంలో కూడా ఉపయోగపడుతున్నాయి. దీంతో పరస్పరం సంబంధం ఉన్న అనేక ఆరోగ్య సమస్యలను ఒకే చికిత్సా వర్గం ద్వారా లక్ష్యంగా చేసుకునే అవకాశం వైద్యులకు లభించింది. ప్రభుత్వాలు, ఆరోగ్య వ్యవస్థలు కూడా ఈ మార్పును గుర్తించాయి. అమెరికాలో ఆహారం, ఔషధాల పరిపాలనా సంస్థ ఆమోదించిన ఊబకాయం చికిత్సా జీఎల్‌పీ-1 మందులకు మెడికెయిడ్ ప్రిస్క్రిప్షన్లు 2019 నుంచి 2024 మధ్య ఏకంగా 546 శాతం పెరిగాయి. ఈ పెరుగుదల జీఎల్‌పీ-1 మందులు ఎంత వేగంగా ప్రధాన చికిత్సా విధానంగా మారుతున్నాయో చూపిస్తోంది. మార్కెట్ విశ్లేషకుల అంచనాల ప్రకారం 2035 నాటికి ప్రపంచ జీఎల్‌పీ-1 మార్కెట్ 190 బిలియన్ అమెరికన్ డాలర్లను దాటే అవకాశం ఉంది. ఈ గణాంకాలు ఔషధ తయారీ సంస్థలు, పెట్టుబడిదారులు, నియంత్రణ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా ఈ మార్కెట్లో వేగవంతమైన నిర్మాణాత్మక మార్పులకు పరిస్థితులు సిద్ధమవుతున్నాయి.

**తదుపరి దశ.. ఆవిష్కరణతో పోటీ..**

ఐక్యూవీఐఏ అంచనా ప్రకారం 2026 కీలక సంవత్సరంగా మారనుంది. భారత్ వంటి మార్కెట్లలో సెమాగ్లూటైడ్ పేటెంట్ల గడువు ముగియడం ప్రారంభం అయింది. పేటెంట్ల గడువు ముగిసిన తర్వాత జనరిక్, తదుపరి తరం ఔషధ తయారీ సంస్థలు మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. తయారీ రంగంలో పోటీ పెరగడం వల్ల ధరలు తగ్గి, ప్రస్తుతం అధిక ధరల కారణంగా ఈ మందులకు దూరంగా ఉన్న ప్రజలకు ఇవి మరింత అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. ఇప్పటికే పలు సంస్థలు జనరిక్ మందులను విక్రయిస్తుండగా, రానున్న రోజుల్లో మరిన్ని ఔషధాలు అందుబాటులోకి రానున్నాయి.

**భారత్‌కు అవకాశం..**

బ్రెజిల్ ఇప్పటికే ఈ మార్పు ఎలా ఉంటుందో చూపించింది. అక్కడ పేటెంట్ గడువు ముగిసిన తర్వాత ఐదు కొత్త ఇంజెక్టబుల్ సెమాగ్లూటైడ్ ఉత్పత్తులకు అనుమతులు లభించాయి. ప్రత్యేక హక్కుల అడ్డంకులు తొలగినప్పుడు మార్కెట్లు ఎంత వేగంగా విస్తరించగలవో ఈ పరిణామం వెల్లడించింది. భారత్ కూడా ఇలాంటి కీలక మలుపు వద్ద నిలిచింది. తయారీ, ఔషధ సూత్రీకరణలో నమ్మకమైన ఆవిష్కరణ కేంద్రంగా ఎదగడానికి దేశానికి ఇది మంచి అవకాశం. భారత్‌లో ఇప్పటికే ఉన్న ఔషధ తయారీ మౌలిక వసతులు పెద్ద స్థాయిలో ఉత్పత్తిని పెంచేందుకు అనుకూలంగా ఉన్నాయి. అయితే అదే సమయంలో రోగులు, నియంత్రణ సంస్థలు కోరే నాణ్యత ప్రమాణాలను కూడా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

**నమ్మకం దెబ్బతింటే.**

జీఎల్‌పీ-1 మందులకు ఎక్కువ ప్రాప్యత ఒకవైపు అవకాశం అయితే, మరోవైపు ప్రమాదాన్ని కూడా పెంచుతోంది. అనేక మార్కెట్లలో నకిలీ, తప్పుడు జీఎల్‌పీ-1 ఉత్పత్తులను గుర్తించారు. మోసపూరితంగా తయారు చేసిన కంపౌండెడ్ జీఎల్‌పీ-1 మందులు, నకిలీ ఫార్ములేషన్ల విషయంలో అమెరికా ఆహారం, ఔషధాల పరిపాలనా సంస్థ వినియోగదారులు, ఆరోగ్య నిపుణులకు హెచ్చరికలు జారీ చేసింది. ఔషధ భద్రత పర్యవేక్షణ అధ్యయనాల్లో నకిలీ సెమాగ్లూటైడ్‌కు నేరుగా సంబంధించిన భద్రతా సమస్యలను కూడా గుర్తించారు. నాణ్యత హామీ వ్యవస్థలు విఫలమైతే వైద్య రంగంలో సంచలనాత్మక మార్పు ఎంత వేగంగా ప్రజారోగ్య సమస్యగా మారగలదో ఇది చూపిస్తోంది.

అత్యంత కీలకం కావడంతో స్వయంగా మందులు వాడటం, తగిన వైద్య సూచనలు లేకుండా మందులు సూచించడం అదనపు ప్రమాదాలను సృష్టిస్తున్నాయి.

# గాయాలు అయిన వారు ఇలాంటి నీటిలోకి దిగితే ప్రమాదకరం
## మాంసాన్ని తినే బ్యాక్టీరియా వ్యాపిస్తుంది



మాంసాన్ని తినేసే బ్యాక్టీరియాగా పిలిచే కొన్ని రకాల సూక్ష్మజీవులు వేడెక్కుతున్న సముద్ర జలాల్లో వేగంగా విస్తరిస్తుండటంతో ప్రజల్లో ఆందోళన పెరుగుతోంది. ముఖ్యంగా విబ్రియో వల్నిఫికస్ అనే బ్యాక్టీరియా గాయాల ద్వారా శరీరంలోకి ప్రవేశించి తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతుంది. అరుదుగా సంభవించినప్పటికీ, ఈ ఇన్ఫెక్షన్ వేగంగా ప్రాణాంతకంగా మారే అవకాశం ఉండటంతో సముద్రంలో ఈత కొట్టేవారు, మత్స్యకారులు, పచ్చి సముద్ర ఆహారం తినేవారు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మాంసాన్ని తినే బ్యాక్టీరియా అనే పదం వాస్తవానికి చర్మాన్ని తినేయడం అనే అర్థంలో కాదు. కొన్ని బ్యాక్టీరియాలు నెక్రోటైజింగ్ ఫాసియైటిస్ అనే అరుదైన తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. ఇవి శరీరంలోకి ప్రవేశించిన తర్వాత విషపదార్థాలను విడుదల చేసి చర్మం కింద ఉండే కణజాలంతోపాటు కండరాలు, నరాలు, రక్తనాళాలను దెబ్బతీస్తాయి. బ్యాక్టీరియా రక్తప్రవాహంలోకి చేరితే ఇతర అవయవాలకు కూడా వేగంగా వ్యాపిస్తుంది. చికిత్స అందకపోతే కొన్నిసార్లు 48 గంటల్లోనే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుంది. ఎలాంటి నీటిలో ఉంటుంది..నెక్రోటైజింగ్ ఫాసియైటిస్‌కు సాధారణంగా గ్రూప్ ఎ స్ట్రెప్టోకోకస్ బ్యాక్టీరియా ప్రధాన కారణంగా ఉంటుంది. అయితే విబ్రియో వల్నిఫికస్ కూడా ఈ తీవ్రమైన ఇన్ఫెక్షన్‌కు కారణమయ్యే బ్యాక్టీరియాల్లో ఒకటిగా ఉంది. అమెరికాలో ప్రతి ఏడాది సుమారు 150 నుంచి 200 వరకు విబ్రియో వల్నిఫికస్ ఇన్ఫెక్షన్లు నమోదవుతున్నప్పటికీ, వీటిలో సుమారు ఐదుగురిలో ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. యూరప్‌లోనూ ఈ ఇన్ఫెక్షన్ల సంఖ్య పెరుగుతున్నట్లు సమాచారం. విబ్రియో వల్నిఫికస్ ప్రధానంగా వేడిగా ఉండే సముద్రపు నీటిలో జీవిస్తుంది. సముద్రం, మంచినీరు కలిసే ఉప్పునీటి ప్రాంతాల్లోనూ ఇది కనిపిస్తుంది. సాధారణంగా వెచ్చని నెలల్లో ఇన్ఫెక్షన్లు ఎక్కువగా నమోదవుతాయి. సముద్రంలో ఈత కొట్టడం, చేపలు పట్టడం లేదా నీటిలోకి దిగిన సమయంలో శరీరంపై ఉన్న చిన్న గాయం, కోత లేదా పుండ్ల ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది. సముద్రపు నీటిలో పట్టిన షెల్‌ఫిష్, ముఖ్యంగా ఆయిస్టర్లు వంటి సముద్ర ఆహారంలోనూ ఈ బ్యాక్టీరియా ఉండే అవకాశం ఉంటుంది. వాటిని పచ్చిగా లేదా సరిగ్గా ఉడికించకుండా తినడం వల్ల ఆహార సంబంధిత ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉంటుంది. అలాగే చేతిపై గాయం ఉన్నప్పుడు పచ్చి చేపలు లేదా సముద్ర ఆహారాన్ని శుభ్రం చేయడం, పట్టుకోవడం ద్వారా కూడా బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశిస్తుంది.

# నేను ఓడిపోతా కాంగ్రెస్ ప్రభుత్వం ఓడిపోతది
## మంత్రి వివేక్ ఆసక్తికర వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** రాష్ట్రంలోని కాంగ్రెస్ మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలు ప్రజల్లో ఆసక్తిని కనబరుస్తున్నాయి. వారి వ్యాఖ్యలు ప్రభుత్వానికి , అధిష్టానానికి తలనొప్పిగా మారుతున్నాయి. తాజాగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేకా వెంకటస్వామిచేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి స్కీం లో విలీనం చేసే ఆలోచనపై కళాశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే . దీంతో పాటు ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు వినతి పత్రాలను సమర్పిస్తూ తమ గోడును వెల్లబుచ్చుకుంటున్నారు.ఇందులో భాగంగా పాలిటెక్నిక్ విద్యార్థులు చెన్నూరు పట్టణంలో మంత్రి వివేకా ఇంటికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరగా మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం సంచలనంగా మారింది. నేను గ్యారెంటీ ఇవ్వలేను. ఇప్పుడు మంత్రిగా నేను ఉన్నా.. రేపు నేను ఓడిపోతా ..మా గవర్నమెంట్ పోతది.
.నా గ్యారెంటీ తో మీకేం ఫాయిదా అంటూ వ్యాఖ్యానించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలు తలనొప్పిగా మారాయి.



# మధుయాష్కీపై కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ :** కాంగ్రెస్ లో కుమ్ములాటలు ఒక్కటొక్కటి బయటకు వస్తున్నాయి. ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌పై, ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేల వ్యాఖ్యలు దుమారం రేపుతుండగా వాటికి కొనసాగింపుగా మాజీ పార్లమెంట్ సభ్యుడు, బీసీ నాయకుడు మధుయాష్కీ పై కాంగ్రెస్ మహిళా నాయకురాలు కొత్త విద్య తీవ్ర ఆరోపణలు చేశారు.ఎల్బీనగర్‌లో స్పా సెంటర్లు నడుపుతున్న వ్యక్తికి మధుయాష్కీ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్ష పదవి ఇచ్చాడని విమర్శించారు. ఎల్బీనగర్‌లో మూడు, నాలుగు స్పా సెంటర్లు నిర్వహిస్తూ, వ్యభిచారం చేయిస్తూ అరెస్టయిన కేతవత్ రమేష్ నాయక్‌కు మధుయాష్కీ సాహెబ్ నగర్ డివిజన్ అధ్యక్ష పదవి ఇచ్చాడని పేర్కొన్నారు.
స్పా సెంటర్ల నిర్వహణ వెనక మధుయాష్కీ అనుచరుల హస్తం ఉన్నట్లు తెలుస్తోందని ం వ్యక్తం చేశారు. అసలు ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎటుపోతుందని, ఈ వ్యవహారంపై మీనాక్షి నటరాజన్, మహేష్ కుమార్ గౌడ్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని లేఖను రాశారు.



# నా టార్గెట్ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ కాదు
## కొండా సుస్మిత మరోసారి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత సీఎం రేవంత్ రెడ్డి పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో కలకలం రేపుతుండగా శుక్రవారం చేసిన వ్యాఖ్యలు కూడా సంచలనంగా మారాయి. ఒక టీవీ ఛానల్‌కు ఇచ్చన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె రేవంత్ రెడ్డిపై మరోసారి విరుచుకు పడ్డా రు. తాను కాంగ్రెస్ పార్టీ ని విమర్శించలేదుని, రేవంత్ రెడ్డిని లక్ష్యంగా విమర్శించానని సమర్ధించుకున్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ఖర్గే, వేణుగోపాల్, మీనాక్షి మేడం అంటే గౌరవం ఉందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, అతని సోదరులు విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అందుకే అతన్ని టార్గెట్ చేశానని పేర్కొన్నారు.పరకాలలో పర్యటించిన సీఎం రేవంత్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తానని ప్రకటించారని , అతనికి ఏం అధికారం ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభ్యర్థుల జాబితాలను కాంగ్రెస్ అధిష్టానం, సీడబ్ల్యూసీ ప్రకటిస్తుందని గుర్తు చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను రాబోయే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.




# కుభీర్‌లో బీఆర్ఎస్ శ్రేణుల భారీ ర్యాలీ
## తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా



**కుభీర్ :** పేదింటి ఆడబిడ్డల వివాహానికి ఆర్థికంగా అండగా నిలుస్తున్న కల్యాణలక్ష్మి , షాదీముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించాలని బీఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి తహసీల్ కార్యాలయం వద్ద బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు అన్నబావు సాటే, చత్రపతి శివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలను నిర్వీర్యం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈపాటికి ఇన్సూరెన్స్ కంపెనీకి ప్రీమియం చెల్లించక పోవడంతో రైతు బీమా పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఆందోళనలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగాచరణ్, వైస్ ఎంపీపీ మొహి యొద్దీన్, సుంకెటపోశెట్టి, ఎన్నిల అనిల్, గంధం పోశెట్టి, బాబు, దొంతుల దేవి దాస్, జి కాశీనాథ్, దేవన్న, చిన్న పార్డి దత్తు, ఏఖి నోద్దీన్, గడపాలే దత్తాత్రి, జీవన్, వర్ని రమే ష్, చోండి పోతన్న, మాదన్న, నాయకులు పాల్గొన్నారు.

# శక్తి వద్దు పాలిటెక్నిక్ ముద్దు



**సిరిసిల్ల:** 97 రద్దు కోరుతూ బీఆర్ఎస్వీ నాయకులు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రాజరాజేశ్వర స్వామి పాలిటెక్నిక్ కళాశాల ఎదుట శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. శాంతియుతంగా నిరసన చేపడుతున్న నాయకులపై పోలీసుల అత్యుత్సాహం తగదని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. 97ను రద్దు చేయా లని ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై లాఠీచార్జ్ చేసిన పోలీసుల తీరును ఖండిస్తున్నామని పేర్కొన్నారు.విద్యార్థుల డిమాండ్లపై చర్చించకుండా ప్రభుత్వం త్) పోలీసులతో అణచివేయడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. విద్యార్థి నాయకులను అరెస్టు చేయడం, వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శక్తి వద్దు.. పాలిటెక్నిక్ ముద్దు అనే నినాదంతో విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం వెంటనే 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ పంచాయతీ కార్యదర్శి

**మంచిర్యాల :** రాష్ట్రంలో అవినీతి తిమింగిలాలు ఏసీబీ వలకు చిక్కుకుంటు న్నాయి. నిన్న ఇద్దరు ఉద్యోగులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడగా శుక్రవారం మంచిర్యాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శి పట్టుబడ్డారు. జిల్లాలోని జన్నారం మండలంలో శుక్రవారం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు.
లింగయ్యపల్లె గ్రామపంచాయితీ కార్యదర్శి వరలక్ష్మి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి అనుమతి కోసం రూ.11 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ అధికారులు మాటువేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తీసుకున్న లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు ఆమెపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.




# నాగార్జున సాగర్ నిండినంకనే నీటిని తరలించండి
## మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్

**నల్లగొండ:** నీళ్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు ద్రోహం చేస్తుందని దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఏపల్లి మండలం గణపురం స్టేజ్ సమీపంలోని ఏఎంఆర్పీ మెయిన్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ మెయిన్ గేట్ల వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుమారు 25 వేల క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు నుంచి తరలిస్తున్నప్పుడు నాగార్జున సాగర్‌కు నీరు రాకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. నాగార్జున సాగర్ నిండేంత వరకు పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎవరి ఆదేశాలతో నీటిని తరలిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. నాగార్జున సాగర్‌లో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించేందుకు జిల్లా మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.కసీఆర్ హయాంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించామని గుర్తుచేశారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే సాగునీరు అందించాలని అన్నారు. ఈ ప్రాంత రైతులు ప్రధానంగా భూగర్భ జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో భూగర్భ జలాలు పడిపోతున్నాయి. ప్రజలు, పశువులకు తాగునీటి సమస్య ఎదురవుతుందని రవీంద్ర కుమార్ ఆదేవన వ్యక్తం చేశారు. నల్లగొండ పట్టణానికి తాగునీటిని తరలించడంతో పాటు గుడిపల్లి, పీఏ పల్లి మండలాల్లోని చెరువులు, కుంటలను కూడా నింపాలని కోరారు.చంద్రబాబు నాయుడు ప్రయోజనాల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన ప్రభుత్వం ఇతర రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. స్థానిక ఎమ్మెల్యేకు నల్లమట్టి మీద ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. రైతుల సాగు, ప్రజల తాగునీటి అవసరాలపై ఎమ్మెల్యే స్పందించకపోవడం బాధాకరం అని దుయ్యబట్టారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి, సీనియర్ నాయకులు కటికనేని మాధవ రావు, తోటకూరి పరమేశ్, సుధాకర్ గౌడ్, సర్పంచులు కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి, రైనబోయిన శ్రీను, నగేశ్, రమావత్ కిషన్, అర్వపల్లి నర్సింహ, బొడ్డుపల్లి మహేందర్, దీపావత్ నరేందర్, ఎర్ర యాదగిరి, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# టాయిలెట్లు శుభ్రం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు



**నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవెల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు శుభ్రం చేశారు. శుక్రవారం తహసీల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అపరిశుభ్రంగా ఉన్న టాయిలెట్ల నిర్వహణపై అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి స్వయానా నీటితో శుభ్రం చేశారు.

# ఆద్యంతం హడావిడిగా సాగిన మంత్రి పర్యటన

**జగిత్యాల :** ప్రారంభాలు...పరిశీల నలు... లబ్ధిదారులతో ముఖా ముఖి....సమా వేశం. .సమీక్ష... వినతి పత్రాల స్వీకరణలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం జగిత్యాలలో జరిపిన పర్యటన ఆద్యంతం హడావిడిగా కొనసాగింది. జగి త్యాల జిల్లాకేంద్రంతో పాటుసమీపంలోని నూకపల్లి అర్బన్ హౌ జింగ్ కాలనీలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల, చొప్ప దండి ఎమ్మె ల్యేలు, ఉన్నతాధికా రబృందంతో మంత్రి పర్యటించారు.
రూ.11.80కోట్లతో

**పలు భవన నిర్మాణాలకు శంకుస్థాపన..**

జిల్లాలోని పలుప్రాంతాల్లో రూ.11.80కోట్లతో నిర్మిం చతలపెట్టిన పలుఅభివృద్ధిపనులకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శంకుస్థాపన, శిలాఫలకాల ఆవిష్కరణ జరిపారు. జగి త్యాలలో రూ.2.25కోట్లు, మెట్‌పల్లిలో రూ.2.25కోట్లతో ఆర్డీవోకార్యాలయ భవనాలు, ఎండపల్లిలో రూ.2.25 కోట్లు, బీమారంలో రూ.2.25 కోట్లతో తహసీల్ధార్ కార్యా లయ భవన నిర్మాణాలు, మల్యాలలో రూ.1.40కోట్లు, మెట్‌పల్లిలో రూ.1.40కోట్లతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలపనులకు శిలాఫలకాలను జగిత్యాలలో ఆవిష్కరించారు.



# అధికారులకు రైతులంటే అంత చులకనా

**బీర్పూర్, :** అధికారుల కు రైతులంటే అంత చుల కనగా ఉందా?. నెల రోజు లు గడుస్తున్నా లిఫ్ట్ ఇరి గేషన్‌లలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎందుకు ఏర్పాటు చేయ లేదని మాజీమంత్రి, బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి అన్నా రు. శుక్రవారం మండలంలో పర్యటించిన ఆయన మం గేళ, కమ్మునూర్ గ్రామాల్లోని లిఫ్ట్ ఇరిగేషన్‌లను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి గతనెల 27న ట్రాన్స్‌ఫార్మార్లు ఏర్పాటు చేయాలని కొరినప్పుడు వారం రోజుల గడువు అడిగిన మీరు నెల రోజులైనా ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కాలువ నీరు వచ్చే అవకాశం లేనప్పుడు రైతులకు ఉన్న ఏకైక మార్గం కరెంటు మోటార్లు అని అన్నారు. అవి నడవాలంటే ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేయడం ఒకే మార్గమని అన్నారు. ఆరెపల్లి, ధర్మపురి నియోజకవర్గం వారుకూడా తనవద్దకు వస్తున్నారని వివరించారు. సోమవారం వరకు రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేసి సాగు నీరు అందించాలని సూచించారు. ఆయన వెంట మాజీఎంపీపీ మసర్తి రమేష్, మాజీ జడ్పీటీసీ ముక్క శంకర్, నాయకులు జితేంధర్ యాదవ్, లక్ష్మన్ రావ్, సుభాష్ యాదవ్, జోగిరెడ్డి, మల్లా రెడ్డి, లక్ష్మినారాయణ, ఉప సర్పంచ్ వీరేష్ ఉన్నారు.



"VISHALA JYOOTHI" vide PRGI Registration No. "TGBIL/25/A0946" Printed by Published by DEVENDAR KUNTA on behalf of DEVENDAR KUNTA, printed atHAMARA WARANGAL PRINTERS AND GRAPHICS, H.NO: 25-8-182,BABUJI NAGAR, KAZIPET, WARANGAL, TELANGANA - 506003. and published at H.NO. 4-123/1,KUNTA WADA,RAIPARTHY, WARANGAL, TELANGANA - 506314. Editor DEVENDAR KUNTA, Cell : 9440711117.